కథ



# వాళ్ళు

-కోలపల్లి ఈశ్వర్

**ఆ సినిమాలో కథేంటో ఎవరినీ అడగొద్దు - నటీనటుల గురించి అడగాలంటే ముందు ఆ పేర్లని చదవగల గాలి కాబట్టి ... అలాంటి ప్రయత్నమూ వద్దు. మరి ఆ సినిమా పేరేంటో చదవగలిగినా - దానికర్థం డిక్షనరీలో చూస్తే తప్ప తెలుసుకోలేరు చాలా మంది. అయినా ఆ ఇంగ్లీష్ చిత్రానికి అంత జనం - ఎందుకో మరి ...**

**అది చాలా సులభం -**

జనం చొంగకార్చుకుంటూ ఆ సినిమాకి చేరింది - చాక్లెట్ ముక్కల్లాంటి 'ఆ' సీన్లకోసం. అసలు ఆ పోస్టర్ చూసే - మేం కూడా వచ్చాం - మండుటెండలో మ్యాటనీకి.

అపురూపమైన అందాలరాశి నగ్నంగా కూర్చుని మత్తుగా నవ్వుతున్న స్టిల్ - అయస్కాంతంలా జనాన్ని లాగేస్తోంది.

అంటే... న్యూడ్ సీన్లు లేకపోతే ఇంగ్లీష్ చిత్రాలని మన తెలుగు వాళ్ళు చూడరా అని లాజిక్కు లాగొద్దు - ఇంగ్లీష్ సినిమాలో న్యూడ్ సీన్లుంటే హాలు నిండుతుంది - లేకపోతే ఆస్కార్ అవార్డుని పొందిన బహుగొప్ప చిత్రమైనా - వారం రోజులు ఆడాలంటే కష్టమే కదా!

'ఏ' సర్టిఫికెట్ పొందిన సినిమాకి ఏ సర్టిఫికెటూ లేని పామరుల దగ్గర్నుంచీ, ఏ సర్టిఫికేటు అవసరం లేకుండానే లక్షలు సంపాదించిన దర్జాబాబుల వరకూ ... అన్ని వర్గాల వారూ వస్తారు.

టిక్కెట్లు తీసుకుని, గేటు ఎప్పుడు తెరుస్తారా అని ఎదురు చూస్తుంటే - అప్పుడు వచ్చారు వాళ్ళిద్దరూ.

చాలా మందికి ఇప్పుడు మాట్లాడుకోనేందుకో టాపిక్ దొరికింది.

ఇద్దరూ ఎత్తు మడమల షూస్ వేసుకున్నా - పొట్టిగానే వున్నారు. ఇద్దరూ ఆకర్షణీయంగా కనిపించాలని మోడరన్ దుస్తులు వేసుకున్నా, స్వాభావికంగా సంక్రమించిన నలుపు రంగు నుంచి తప్పించుకోలేక పోతున్నామన్నట్టుగా కనిపిస్తున్నారు. తలపై కేప్స్, కళ్ళకి స్పెట్స్ - ఇద్దరికీ వున్నాయి. హైస్కూల్ పిల్లల్లా అనుకోలేని విధంగా వాళ్ళ ముఖాలు ముదిరిపోయి వాళ్ళ యవ్వనం బయటపడుతోంది. మొత్తానికి ఫ్యాషనబుల్‌గా వున్నారు వాళ్ళు.

ఆ ఇద్దరిలో మరింత పొట్టిగా కనిపించే ఆకారం నడకని బట్టి మరింత పరిశీలనగా చూస్తే - అది ఓ ఆడపిల్ల ఆకారమని చెప్పడానికి మరో సాక్ష్యం దొరుకుతుంది - అది ఆవిడ తలపై ఉన్న కేప్‌నుంచి, షర్ట్ కాలర్‌లోకి వెళ్ళి ఉబ్బెత్తుగా కనిపిస్తున్న ఆవిడ జడ. బహుశా ఆవిడ తన బాబ్డ్ హెయిర్‌నే అలా ముడివేసి షర్ట్‌లోకి త్రోసి వుండొచ్చు.

మగ ఆకారానికి ఆమె అతి దగ్గరగా నడుస్తూ జనం మధ్యలో తిరుగుతున్నప్పుడు - వాళ్ళు సిగ్గుపడుతున్నారో లేక భయపడుతున్నారో అని - అందర్లో కొందరు - బాగా పరిశీలించి చూస్తున్నారు.

మగ వాళ్ళకీ, ఆడవాళ్ళకీ ఒకే కౌంటర్ కాబట్టి ఇద్దర్లో ఎవరు తీసుకున్నారు టిక్కెట్లు అనే ప్రశ్నే లేదు - అతనే!

నా ప్రక్కన ప్రకాశం 'చూశావా' అన్నాడు. ప్రకాశంని నేను చాలా కాలం నుంచి ఎరుగుదును. అతని తత్వం కూడా బాగా తెలుసు. అతనికి ఇప్పుడు ఎంతో 'ఇది'గా వుంది. ఇదీ అని చెప్పలేని ఆ 'ఇది' అతని సైకాలజీ. ఇన్ని వేల మందిలో ఒక్క అమ్మాయి - ఒక అబ్బాయితో కలిసి 'ఇలాంటి' సినిమాకి రావడానికి ఎంత ధైర్యం - అదీ అతని సమస్య.

''చూశానుగానీ - ఈ రోజుల్లో అది మామూలే'' అనే సరికి నిప్పుల్లో నీళ్ళు పోసినట్టు అది అయ్యాడు. అది అంటే ఏమిటో అతన్ని అడిగినా క్లియర్‌గా చెప్పలేడు మరి!

సినిమా మొదలైపోయాక, చీకట్లో వచ్చారు వాళ్ళు హాల్లోకి! నెంబర్లిచ్చారు కాబట్టి - మా సీట్లకి ముందుగా ఆ మధ్య వరుసలోనే - చివరి సీట్లు వాళ్ళవి.

సినిమా ఇంటరెస్టింగ్‌గానే వుండడం వల్ల సినిమా చూడ్డంలో నిమగ్నమయ్యాం. కాస్సేపయ్యాక కావలసిన సీన్లు వస్తున్నాయి. హీరోయిన్ అద్దం ముందు నగ్నంగా - ఒక బ్రా తనకి సరిపోతుందో లేదో అని చూసుకునే సీను, అద్దాల బాత్‌రూంలో స్నానం చేసే దృశ్యం ... ఇంకా కొంచెం ఘాటయిన సీన్లు కూడా కథానుసారంగా వస్తున్నాయి.

''ఏసీ ఆఫ్ చేశాడు వెధవ, బాస్టర్డ్ ...'' అంటూ మొదలెట్టాడు ప్రకాశం. అతనికి ఇరిటేటింగ్‌గా వుంది. ఇలాంటివన్నీ నేను పట్టించుకోకపోయినా - అతను నాకు 'స్పాన్సరర్' కాబట్టి అవును - 'బాస్టర్డ్' అని నేనూ తిట్టాను.

'విశ్రాంతి!'

'చూడూ' అన్నాడు ప్రకాశం. చూశా!

'కూల్‌డ్రింక్ - స్ట్రాల్లో త్రాగటం ఈ రోజుల్లో ఫ్యాషన్' అన్నాను. 'అది సరే - ఒక కూల్‌డ్రింక్ - ఇద్దరూ మార్చి మార్చి తాగుతున్నారు - అది చూడు' అన్నాడు.

నిజమే!

'అన్నా చెల్లెళ్ళేమో' అన్నాన్నేను.

'నీకసలు బుర్ర ఉందా?' అన్నాడు 'అన్నా చెల్లెళ్ళు - హు ... ఇలాంటి సినిమాకి?'

'అరె - ఈ రోజుల్లో అలా రావడం కల్చర్ అయిందయ్యా'

'చాల్లే - కల్చర్ గురించి చెప్తున్నావ్? అన్నా చెల్లెళ్ళు అయితే - దాదాపు బ్లూ ఫిలింలాంటి ఈ సిన్మాకి వస్తారని నన్ను నమ్మమంటే - నిన్ను ఏమని పిలవాలో నువ్వే చెప్పాలి.'

'సరే - నువ్వన్న దాన్లోనూ పాయింటుంది. పోనీ బావా మరదళ్ళయి వుంటారా?'

'కాదు'

'ఎందుక్కాదు?'

'అటు చూడవోయ్ దద్దమ్మా - వేరుశనక్కాయలు-నోటికందిస్తోంది అది.'

'సర్లె - ఎవరైతే మనకేల? అదిగో సినిమా మొదలైంది - సీన్లు చూడు -'

'అరె - ప్రకాశం - ఆ చీకట్లో నీకేమీ కనిపించదు గానీ స్క్రీన్ వంక చూడు' సినిమాలో పచ్చి శృంగారంతో రెచ్చగొట్టే సీన్లు కూడా వచ్చాయి. క్షణం మిస్సయితే ఎంతో నష్టం





అన్నట్టుగా రెప్ప వేయకుండా చూసే సమయాల్లో - నా మిత్రుడి వంక చూడాలనిపించలేదు.

ఆట ముగియవచ్చింది.

ఆ చీకట్లోనే వాళ్ళు లేచి బయటకు వెళ్తున్న జనంతో కలిసి పోతున్న సంగతి - ప్రకాశం చెప్తేగాని తెలియలేదు.

సినిమా హాలు బయటకు వచ్చాం.

ప్రకాశం రెస్ట్‌లెస్‌గా కనిపించాడు. ఏదో ఏహ్యతా భావం ప్రదర్శించాలనో, ఏదో కామెంట్ చేయాలనో, ఏదో అసహనంగా ...

'కథకేమైనా అర్థం ఉందా?' అన్నాడు - ఎవడో మిత్రుడు కలిస్తే!

'ఇంగ్లీష్ సినిమాకొచ్చి కథ గురించి కామెంట్ చేస్తారా?' అని నేను మందలించా!

''ఇంతకూ - వాళ్ళకెంత ధైర్యం చెప్పు!' అని అన్నాడు - ఇద్దరం కాఫీ హోటల్లో కూర్చున్నాక.

''ప్రకాశం! నువ్వు చూసిందాని గురించి అంత ఇరిటేట్ అవుతున్నావు - అసలు - మనకు అనవసరం కదూ!''

''అదేమరి! నీకు వాళ్ళు అన్నా చెల్లెళ్ళులా కనిపిస్తారు - ఇంత వరకు వ్యవహారం - పబ్లిగ్గా ఎందుకూ అంట!'' వెటకారంగా అన్నాడు.

''ప్రకాశం - నీతీ నియమం - సంఘం, కట్టుబాట్లు - వీటిని గురించి కదా నువ్వు మదనపడుతున్నావ్? నువ్వు ఆడపిల్లల తండ్రివి - నేనింకా బ్రహ్మచారిని - బహుశా అక్కడే నీకూ నాకూ ఏదో తేడా వస్తుందనుకుంటా'' ధైర్యంగా అన్నాను. అతనేమనుకున్నా ఫరవా లేదనే.

''ఆ - నా పిల్లలు ఇంకా చిన్నవాళ్ళు - అంత సంకుచితంగా ఆలోచించేంత వెధవనా?'' ప్రకాశం నొచ్చుకున్నాడనిపించింది.

''మరిదేనికి ఈ మీమాంస? వాళ్ళు ఫ్రెండ్స్ కావచ్చు, ఇరుగింటి పొరుగింటి వాళ్ళ బైపు కావచ్చు, కొలీగ్స్ కావచ్చు - అయితే - తెర వెనుక- ప్రాక్టికల్‌గా ఈ 'సరదా' తీర్చుకొనే వాళ్ళు మన చుట్టూ వుంటారని ఎందుకు ఊహించలేవు? మనం కూడా ఇలాంటి అవకాశం - అంటే రహస్యంగా ప్రాక్టికల్స్ జరుపుకొనే అవకాశం వస్తే - జారవిడ్చుకుంటామా?''

ప్రకాశం జవాబివ్వలేదు.

''విడుచుకోము - కాకపోతే అలాంటి ఆలోచన మనకు లేదు - మనం చాలా బుద్ధిమంతులం అని మన్పై మనకు ఒక గొప్ప అభిప్రాయం - కానీ తప్పు! నిజానికి మనం పిరికివాళ్ళం - ఆ తెగువ, చొరవ మనకి లేనేలేవు. అవునా కాదా?''

ప్రకాశం నిర్లక్ష్యంగా నవ్వాడు.

ఆ నవ్వుకి అర్థం ఏమిటి?

తను నాతో ఏకీభవిస్తున్నాడా? నన్నోఫూల్ క్రింద జమకడుతున్నాడా?

''నువ్వెన్ని చెప్పు - నేను ఒప్పుకోను. ఆ అమ్మాయి మగవాడి గెటప్‌లో వచ్చింది - వాళ్ళిద్దరూ హాల్లోకి చీకట్లోనే వచ్చారు - చీకట్లోనే హాల్లోంచి వెళ్ళిపోయారు. ఇదంతా చూస్తే - ఏమనిపిస్తోంది?''

''..........''

''నీకేమీ అనిపించదు - టేకిట్ ఈజీ అన్నట్టు నీతులు చెప్తున్నావ్! నిజంగా - ఆలోచించు - దీన్ని ఈజీగా తీసుకోవచ్చా?'' రెట్టించాడు ప్రకాశం.

నేను ఆలోచనలో పడ్డాను.

ప్రకాశం అన్న దానిలో ఏదో రీజనింగ్ ఉంది ... ఇలాంటి పని - వాళ్ళు చేయకూడదు - కానీ ... కానీ .. చేసేవాళ్ళు ఎందరో రహస్యంగా చేస్తూనే వుంటారు. వీళ్ళు కేవలం ఓ ఇంగ్లీషు పిక్చర్‌కి వచ్చారు. అంచేత ... అంచేత?

'ఏం మాట్లాడవూ?' అంటున్నా నేను జవాబివ్వలేదు.

కానీ అతన్ని వదిలేసి, బస్‌లో ఎక్కి కూర్చున్నాడు కిటికీలోంచి బయటకి చూస్తూ - ఆలోచన సాగించాను. వాళ్ళెవరు? వారిద్దరికీ ఉన్న సంబంధం ఏమిటో కదా!

'అన్నా చెల్లెళ్ళు' అని ఎందుకనుకున్నాను? ఏం - ఇంట్లో కుటుంబ సభ్యులందరూ కలిసి టీవీలో వచ్చే ఎన్నో ఛానెల్స్‌లో వస్తున్న పాటలు, ప్రోగ్రాంలూ, సినిమాలూ చూస్తున్నప్పుడు - ఎంతో ఇబ్బందికరంగా అనిపించే సన్నివేశాలొస్తుంటాయి - కానీ ఇప్పుడవి అలవాటయిపోలేదా? కల్చర్ లేదా నాగరికత - దాని రంగు రుచీ, స్వభావం అన్నీ నేడు మారిపోతున్న నేపథ్యంలో - ఇలాంటి భావ సంఘర్షణ తప్పదేమో!

అయినా - వారెవరో తెలిస్తే కూడా బాగుంటుంది!

## దంతాల 'మహిమ'



'ముత్యాల్లాంటి తెల్లని దంతాలు తెచ్చె బోలెడు తల నొప్పి' అంటోంది మహిమా చౌదరి. షూటింగ్‌లలో కూడా ఆ తళతళలాడే 'తెలుపు'ని మేనేజ్ చేయాలని డెంటిస్ట్‌ని కూడా వెంట తెచ్చుకుంటోందిట. అలాంటిది మొన్న ఓ పన్ను పీకించుకోవాల్సి వచ్చింది. దీంతో తెగ బాధ పడిపోయిందట. మహిమకుండే మహిమ అంతా దంతాల్లోనే ఉందా? అంటున్నారు ఈ సంగతి తెలిసిన వారు.